సాక్షి హనుమకొండ

శనివారం | 10 | జూన్ | 2023



రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. - 8లో▸



ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40^0 / 28^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు ఎక్కువగా వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్


3,279 మంది విద్యార్థుల చేరిక

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఇందులో భాగంగా బడి బయట ఉన్న పిల్లలు, బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈనెల 3న ప్రారంభమైన బడిబాట 9 వరకు కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సదుపాయాలను వివరిస్తూ ఉపాధ్యాయులు కరపత్రాలను రూపొందించి పంపిణీ చేశారు. కాగా, ఎండలతో మొక్కుబడిగానే ఈ కార్యక్రమం కొనసాగిందని సమాచారం. ఒకటో తరగతిలో 1,608 మంది, మిగిలిన తరగతుల్లో 1,671 మందికి ప్రవేశాలు కల్పించారు. మొత్తం 3,279 మంది విద్యార్థు ప్రవేశాలు పొందారని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ తెలిపారు. ఈనెల 10, 11 తేదీల్లో బడిబాట లేదు. 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈనెల 14న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు.

పీహెచ్‌డీ దరఖాస్తుల స్క్రూటినీ షురూ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, లా, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్ విభాగాల పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షరాసి అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పటికే సంబంధిత డీన్లకు దరఖాస్తు చేసిన విషయం విదితమే. ఆయా దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. సైన్స్ డీన్ మల్లారెడ్డి సంబంధిత విభాగాల అధిపతులకు దరఖాస్తులను పంపగా స్క్రూటినీ చేస్తున్నారని సమాచారం. మిగిలిన విభాగాల డీన్లు కూడా ఈ ప్రక్రియ చేపట్టనున్నారని తెలిసింది.

19 నుంచి నిట్‌లో జోసా అడ్మిషన్లు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో మొదటి సంవత్సరంలోకి ప్రవేశానికి గాను జోసా ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) ద్వారా బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశావ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ ద్వారా చాయిస్ ఫిల్లింగ్‌ను ప్రారంభిస్తారు. ఈనెల 19 నుంచి జూలై 31వరకు జోసా అడ్మిషన్లు కొనసాగనున్నాయి.

పుష్పారెడ్డికి నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో క్రైమ్, ఆపరేషన్స్ అడిషనల్ డీసీపీగా, ట్రాఫిక్, అడ్మిన్ ఇన్‌చార్జ్ డీసీపీగా పనిచేస్తున్న కర్రి పుష్పారెడ్డికి శుక్రవారం ప్రభుత్వం నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి కల్పించింది. 2012 గ్రూప్–1 బ్యాచ్‌కి చెందిన పుష్పారెడ్డి 2014 నుంచి హైదరాబాద్ సీఐడీ, సైబర్ క్రైమ్ డీఎస్పీగా, 2018లో కల్వకుర్తి డీఎస్పీగా, 2019 నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో క్రైమ్, ఆపరేషన్స్ అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్నారు. 2020లో సెంట్రల్ జోన్ ఇన్‌చార్జ్ డీసీపీగా పనిచేశారు. ఈ మేరకు పుష్పారెడ్డికి సీపీ రంగనాథ్‌తోపాటు పలువురు పోలీస్ అధికారులు అభినందనలు తెలిపారు.

న్యాయవాద వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రులకు వారి వృత్తిలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖాధికారి నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 30వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. telanganaepass.cgg. gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

12న తెలంగాణ రన్

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12వ తేదీన తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కలెక్టరేట్ నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు రన్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, అధికారులు అన్ని వర్గాల భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

నిధుల్లేక.. పనులు కాక!

నత్తనడకన మన ఊరు-మన బడి, మన బస్తీ-మనబడి

- జిల్లాలో తొలిదశ 176 పాఠశాలల ఎంపిక.. 15 స్కూళ్లలోనే పనులు పూర్తి
- రూ.84.32 కోట్లు కేటాయింపు.. చెల్లింపులు రూ.11.4 కోట్లు మాత్రమే
- 9 పాఠశాలల అభివృద్ధికి ముందుకురాని కాంట్రాక్టర్లు

సాక్షి పరిశీలన

విద్యారణ్యపురి : పాఠశాలలకు సెలవులు ముగిసి ఈనెల 12 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈలోపు మన ఊరు–మనబడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు పూర్తికావాలని నిర్దేశించుకున్నా నిధుల లేమితో నత్తనడకన కొనసాగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా ఆచరణలో మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నెల రోజులుగా వివిధ పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. 10 రోజుల క్రితం ఉపాధి హామీ నిధులు కొన్ని విడుదల కావడంతో పనులు చేసిన వారికి చెల్లించారు. ముస్ముందు నిధులు వస్తాయనే నమ్మకం లేకపోవడంతో ఎస్ఎంసీలు, కాంట్రాక్టర్లు పనులను త్వరితగతిన పూర్తిచేయడం లేదు. జిల్లాలో పలు పాఠశాలలను 'సాక్షి' శుక్రవారం పరిశీలించగా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని వెల్లడైంది.



పిల్లర్ల దశలోనే డైనింగ్ హాల్..

హసన్‌పర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ.14.38 లక్షలతో చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. రూ.7.66 లక్షలతో పలు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. రెండు గదుల్లో ఫ్లోరింగ్ పూర్తయ్యిందని ఏఈ తెలిపారు. విద్యుత్ వైరింగ్ చేసి ఫ్యాన్లు బిగించారు. రూ.61 వేలతో తాగునీరు, రూ.3.66 లక్షలతో కిచెన్ షెడ్, రూ.3.28 లక్షలతో చేపట్టాల్సిన టాయిలెట్స్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. 120 మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్న టాయిలెట్లను వినియోగించుకోవాల్సిందే.



పాఠశాల ఆవరణలోనే ఇసుక, కంకర కుప్పలు

మన బస్తీ–మన బడి కింద హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.5.31 లక్షలతో విద్యుత్ పనులు చేపట్టారు. మిగిలిన పనులు నత్తనకడకన కొనసాగుతున్నాయని పరిశీలనలో వెల్లడైంది. రూ.7.61 లక్షలతో చేపట్టిన టాయిలెట్స్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. రూ.17.2 లక్షల వ్యయంతో చేపట్టాల్సిన పలు మరమ్మతులు కూడా పూర్తికాలేదు. రూ.8.26 లక్షలతో ప్రహరీ నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. 350 మంది విద్యార్థులు ఉన్నారు. బాలికలకు టాయిలెట్స్ ఉన్నా బాలురు, ఉపాధ్యాయులకు మాత్రం లేవు. వరండాల్లో షాబాద్ బండలు తొలగించి వదిలేశారు.

కొనసాగుతున్న పనులు





ఎల్కతుర్తి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పనులు కొనసాతున్నాయి. రూ. 14.98 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.7.32 లక్షలతో చేపట్టిన మరమ్మతులు పూర్తికావొస్తున్నాయని ఏఈ తెలిపారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన టాయిలెట్ల నిర్మాణం రెండుమూడు రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు. రూ.1.39 లక్షలతో డైనింగ్ హాల్ వద్ద హ్యాండ్ వాష్ చేసుకునేందుకు పనులు చేపట్టనున్నారు. పెయింటింగ్, ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డులు రావాలంటే కూడా కొంత సమయం పట్టనుంది.

నిధులు లేకపోవడంతోనే..



పనుల జాప్యానికి పలు కారణాలున్నాయి. ప్రధానంగా నిధులు సకాలంలో రాకపోవడతో నెల రోజులుగా పలు పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. ఇటీవల విడుదలైన ఉపాధి నిధులతో మళ్లీ ఆయా పనులు జరుగుతున్నాయి. కలెక్టర్ కూడా పలుమార్లు సమీక్షించారు. ఇప్పటి వరకు 15 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. పాఠశాలలు పునఃప్రారంభంలోపు అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. విద్యార్థులకు ఇబ్బందులు అంతగా ఏమీ ఉండవు. ఎందుకంటే భవనాలు కూల్చివేసి నిర్మిస్తలేరు.

– ఎండీ అబ్దుల్‌హై, డీఈఓ

15 పాఠశాలల్లోనే పనుల పూర్తి

హనుమకొండ జిల్లాలో 492 పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు–మనబడి, మనబస్తీ–మనబడి కింద తొలి విడుత 176 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ఇప్పటి వరకు కేవలం 15 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. మరో 21 పాఠశాలల్లో వివిధ పనులు పూర్తియినా రంగులు వేయలేదు. డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, టీచర్ల ఫర్నిచర్ రాలేదు.

రూ.84.32 కోట్ల నిధులు కేటాయింపు

14 మండలాల్లోని 176 పాఠశాలల అభివృద్ధికి రూ.84.32 కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు చెబుతున్నారు. ఇందులో రూ.40.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం నుంచి ఈజీఎస్ కింద రూ.23.13 కోట్లు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో వసతులు కల్పించాలి. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మరో రూ .20.93 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం పెయింటింగ్స్, ఫర్నిచర్, డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు సరఫరా చేయనుంది. అయితే, ఇప్పటివరకు ప్రభుత్వం రూ.రూ 9.90 కోట్లు చెల్లించింది. రూ.2.50 కోట్లు ఈజీఎస్ నిధులురాగా ఇటీవల పనులు చేసిన వారికి రూ.1.50 కోట్లు చెల్లించారు. దీంతో మొత్తంగా వివిధ పనులకు రూ.11.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం .

టెండర్లకు ముందుకురాలేదు

జిల్లాలో 9 హైస్కూళ్లలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినా ఎవరు ముందుకురాలేదు. కమలాపూర్ మండలంలో రెండు, పరకాల మండలంలో మూడు, శాయంపేట మండలంలో నాలుగు పాఠశాలల్లో రూ.30 లక్షలపైన ఉన్న పనులకు టెండర్లు పిలవాల్సి ఉండగా కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. దీంతో ఎస్ఎంసీలు కూడా పనులు చేపట్టవచ్చని ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయినప్పటికీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కూడా పనులు చేపట్టేందుకు ముందుకురావడం లేదు.

ఆత్మకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో...


ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఉంది. 220 మంది విద్యార్థులు ఉన్నారు. మన ఊరు మన బడి కింద విద్యుదీకరణ, డైనింగ్ హాల్, నాలుగు అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో విద్యుదీకరణ పనులు చివరి దశలో ఉన్నాయి. డైనింగ్ హాల్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అదనపు తరగతి గదులు నిర్మాణం పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈజీఎస్ నిధులతో కిచెన్‌షెడ్, టాయిలెట్లు నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఇంకా పనులు ప్రారంభించలేదు.



కలెక్టర్ సమీక్షించినా..

గతంలో పనిచేసిన కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్ కూడా పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి డెడ్‌లైన్లు పెట్టారు. మొదట మార్చి 31, తర్వాత పాఠశాలలు ప్రారంభంలోగా అని పెట్టినా కూడా పాఠశాలల్లో పనులు పూర్తికావడం లేదు.

గొర్రెల ఎంపికలో చిత్రవిచిత్రాలు!






పాలుతాగే పిల్లను కూడా గొర్రెకింద లెక్క వేశారని చూపిస్తున్న లబ్ధిదారుడు

కొమ్ములు మొలిస్తే పొట్టేలట

- వాహనాల్లో ఎక్కిస్తూ జీవాలను తప్పిస్తున్న దళారులు
- బక్కచిక్కిన, పాలు తాగే పిల్లలే లబ్ధిదారులకు దిక్కు
- సుదూర ప్రాంతాలకు వెళ్లి ఖాళీగా రాలేని పరిస్థితి
- అందుబాటులో ఉన్న వాటితో తిరుగు ప్రయాణం

హన్మకొండ : ప్రభుత్వం గొల్ల, కురుమలకు అందజేస్తున్న గొర్రెల ఎంపికలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. జీవాలను ఎంపిక చేసి వాహనాల్లో తరలించే సమయానికి తప్పిపోతున్నాయి. దళారులు ఒకటి రెండు గొర్రెలను పక్కదారి పట్టిస్తుండడంతో లబ్ధిదారులకు నష్టం జరుగుతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రెండో విడత గొర్రెల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. హనుమకొండ జిల్లాలోని పరకాల నియోజకవర్గంలో 24 యూనిట్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 24 యూనిట్లు పంపిణీ చేశారు. 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును యూనిట్‌గా ప్రతి లబ్ధిదారుడికి అందించాలి. జిల్లాకు చెందిన లబ్ధిదారులు ఈ నెల 5న ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలుకు వెళ్లి ఈ నెల 8న సాయంత్రం వరకు తిరిగి వచ్చారు. తమకు ఆరోగ్యంగా, బలంగా ఉన్న గొర్రెలను చూపించడం లేదని లబ్ధిదారులు తెలిపారు. బక్కచిక్కిన గొర్రెలు, పాలు తాగే పిల్లలను చూపిస్తూ తమ వద్ద అందుబాటులో ఉన్నవి ఇవేనని, ఇష్టముంటే తీసుకెళ్లండి, లేదంటే వదిలేయండి అంటున్నారని వారు వాపోయారు. దీంతో బక్కచిక్కిన, పాలు తాగే పిల్లలను తీసుకురావాల్సి వచ్చిందన్నారు. పాలుతాగే పిల్ల కూడా పెద్ద గొర్రె కింద లెక్క కడుతున్నారని తెలిపారు. పొట్టేళ్ల ఎంపికలోనూ మోసం, అన్యాయం చేస్తున్నారని, చిన్న మగ గొర్రెపిల్లను కూడా పొట్టేలు కింద పరిగణిస్తున్నారని, మగ గొర్రె పిల్లకు కొమ్ములు మొలిస్తే పొట్టేలు కింద లెక్కించి అంటగడుతున్నారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి గొర్రెల ఎంపికను పూర్తిగా లబ్ధిదారులకే ప్రభుత్వం వదిలేసింది. సుదూర ప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులు అక్కడ గొర్రెల లభ్యత అనువుగా లేక పోవడంతో విధిలేని పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వాటినే తీసుకురావాల్సి వస్తోంది. ప్రయాణ సమయంలోనే గొర్రెలు చనిపోతున్నాయని, లారీల్లోకి గొర్రెలను ఎక్కించే క్రమంలో కొన్నింటిని తప్పిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

పొట్టేలును తప్పించారు..



నేను ఎంపిక చేసుకున్న గొర్రెలకు ఇన్సూరెన్స్ చేసి ట్యాగ్ వేశారు. వీటిని వాహనంలో ఎక్కించే సమయంలో కరెంట్ పోయింది. ఇదే అదునుగా దళారులు ఒక పొట్టేలును తప్పించారు. అక్కడే అధికారుల దృష్టికి రాగా, వేరే వాహనంలో ఉండొచ్చని చెప్పారు. నేను ఇక్కడికి వచ్చిన తర్వాత ఏ వాహనంలో చూసినా పొట్టేలు కనిపించలేదు. కావాలనే అక్కడే తప్పించారు. అదేవిధంగా ఆడ గొర్రెలకు బదులు మూడు మగ గొర్రె పిల్లలు ఇచ్చారు.

– కుంట యాదగిరి, న్యూశాయంపేట

పాలు తాగే పిల్లలు ఇచ్చారు



పెద్ద గొర్రెలు ఇవ్వకుండా పాలు తాగే పిల్లలు ఇస్తూ వాటిని పెద్ద గొర్రెల కింద లెక్కిస్తున్నారు. 2 నెలల గొర్రె పిల్లను కూడా పెద్ద గొర్రె అని చూపిస్తున్నారు. ఇది అన్యాయం. అదేవిధంగా గొర్రెల కోసం వెళ్లిన మాకు తాగడానికి కనీసం నీరు దొరకలేదు. భోజనం, వసతికి చాలా ఇబ్బంది పడ్డాం. ఆరోగ్యంగా, బలంగా ఉన్న గొర్రెలను అందించాలి.


–జె.అనిల్, న్యూశాయంపేట

కల్వర్టు పనుల నత్తనడకపై కమిషనర్ ఆగ్రహం

వరంగల్ అర్బన్ : స్మార్ట్‌సిటీలో భాగంగా కరీమాబాద్ ఫ్లెక్షవర్ నుంచి గవిచర్ల క్రాస్ వెళ్లే రహదారిలోని కీర్తి బార్ వద్ద కల్వర్టు పనుల నత్తనడకన కొనసాగుతుండడంపై గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్‌సిటీ, జంక్షన్ల సుందరీకరణ పనులను కమిషనర్ ఇంజనీర్లతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. మూడు కిలోమీటర్ల పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆ కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఎంజీఎం జంక్షన్‌ను పరిశీలించి, ఒక వైపు డాక్టర్, నర్స్, పేషంట్ పైలాన్, మరో వైపు సఫాయి అన్నకు సలాం పైలాన్ ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు.

సబ్బండవర్గాల సంక్షేమమే లక్ష్యం : చీఫ్‌విప్ వినయ్

హన్మకొండ : రాష్ట్రంలో సంక్షేమం వెల్లివిరుస్తోందని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. చీఫ్‌విప్ జ్యోతి వెలిగించి సంక్షేమ సంబురాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండవర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. 58, 59 జీఓల ద్వారా 11 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్


లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

హనుమకొండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెండో విడుత గొర్రెలను పంపిణీ చేశారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ 24 యూనిట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి వెంకట నారాయణ, పశువైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

సంక్షేమ దినోత్సవంలో ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

కరీమాబాద్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గవిచర్ల రోడ్డులోని జీఎం గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో యాదవులకు గొర్రెలు పంపిణీ చేయడంతోపాటు 95 మందికి కలాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సంక్షేమ పథకం అందుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఆర్డీఓ మహేందర్‌జీ, డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీంమసూద్, కార్పొరేటర్ సువర్ణ, ఏసీపీ బోనాల కిషన్, మిల్స్‌కాలనీ సీఐ ముష్క శ్రీనివాస్ పాల్గొన్నారు.



షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ సారయ్య

ఒకే ప్లాటు ఇద్దరికి అమ్మకం

నలుగురిపై కేసు నమోదు...



హసన్‌పర్తి: ఒకే ప్లాటును ఇద్దరికి విక్రయించిన వ్యక్తిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడు భట్టుస్వామి ఫిర్యాదు మేరకు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన ముస్తఫాకు నిరూప్‌నగర్‌తండాలో రెండు వందల గజాల ప్లాట్లు ఉంది. దీనిని 2006లో భట్టు స్వామి అనే వ్యక్తికి విక్రయించాడు. డబ్బులు పూర్తిగా ముట్టాయి. రిజిస్ట్రేషన్ కోసం భట్టు స్వామి అమ్మకదారుడు ముస్తఫా చుట్టూ తిరిగినా చేయలేదు. ఒరిజినల్ డాక్యుమెంట్లు మాత్రం భట్టు స్వామికి అప్పగించాడు. ఈ క్రమంలోనే ఉపాధి నిమిత్తం ముస్తఫా విదేశాలకు వెళ్లాడు. చివరికి రిజిస్ట్రార్ వద్ద భట్టుస్వామి తన గోడును వెలిబుచ్చుకుని తన భార్యపేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇదిలా ఉండగా, విదేశాలనుంచి తిరిగి వచ్చిన తర్వాత ముస్తఫా ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు తయారు చేసి నగరానికి చెందిన రమేష్‌కు విక్రయించాడు. ఈ విషయమై బాధితుడు భట్టు స్వామి.. సీపీ రంగనాథ్‌ను ఆశ్రయించాడు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా ముస్తఫా చేసిన మోసం బయటపడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ముస్తఫా, రమేష్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

హన్మకొండ అర్బన్: ఈనెల 11న టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 11 రూట్లలో 55 సెంటర్లు ఏర్పాట్లు చేసినట్లు, వీటిలో మొత్తం 21,036 అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజన్ ఆఫీసర్లు, తదితర అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎవరూ సెల్‌ఫోన్లు, షూస్, బ్లూ టూత్, ఎలక్ట్రానిక్ వస్తువులు వారి వెంట తీసుకురావొద్దని సూచించారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



షాపు యజమాని అరెస్టును చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు

వరంగల్ చౌరస్తా : దుకాణాదారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఏంఎస్ మల్లికార్జున దుకాణంలో సదానంద్ బీజీ–2 పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వెల్లడైంది. ఒక ప్యాకెట్ అసలు ధర రూ.853 కాగా.. రెండు ప్యాకెట్లను రూ.2100 అమ్ముతున్నారు. విత్తనాలు, పురుగు మందులను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా, మరో రకం పత్తివిత్తన ప్యాకెట్ అసలు ధర రూ.853 ఉండగా రెండు ప్యాకెట్లను రూ.2100కి అమ్ముతున్నారు. విత్తనాలను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని అక్కల మల్లికార్జున్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలను అమ్మాలని సీపీ సూచించారు.

ముగ్గురికి గ్రేడ్-3 కార్యదర్శులుగా పదోన్నతి


వరంగల్ : ముగ్గురు అసిస్టెంట్ సెక్రటరీలకు గ్రేడ్–3 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న జె. భాస్కర్‌కు గ్రేడ్–3 పదోన్నతి కల్పించి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. ఎ. షరీఫ్‌కు గ్రేడ్–3గా ఇక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మార్కెట్‌కు బదిలీ చేశారు. ఇక్కడే పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌కు గ్రేడ్ –3గా పదోన్నతి కల్పించి జనగామ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

మణుగూరు టు బెల్గావి ప్రత్యేక రైలు పునఃప్రారంభం

కాశిబుగ్గ: మూడో రైల్వే లైన్ పనులతో ఇటీవల నిలిపివేసిన మణుగూరు బెల్గావి ప్రత్యేక రైలు ఆదివారం సికింద్రాబాద్ నుంచి మణుగూరుకు పునఃప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు(07335) 11న ఉదయం 5.25కు సికింద్రాబాద్‌లో ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్‌కు 7.58 గంటలకు చేరుకుని కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, గాంధీపురం, భద్రాచలం రోడ్డు స్టేషన్‌లలో ఆగుతూ 12.50 గంటలకు మణుగూరుకు చేరుకుంటుంది. 12న 07336 రైలు మణుగూరులో 3.40 గంటలకు ప్రారంభమై స్టేషన్‌లలో ఆగుతూ వరంగల్‌కు 7.28, సికింద్రాబాద్‌కు 10.10 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

రహదారులు రక్తసిక్తం..

రహదారులు రక్తసిక్తమయ్యాయి.. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మృతి చెందారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద బైక్.. లారీ కిందికి దూసూకెళ్లిన ఘటనలో అన్నాచెల్లెలు, మరిపెడ మండలం కోమటికుంటా తండా సమీపంలో లారీని బైక్ ఢీకొనడంతో నవదంపతులు, మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామంలో బైక్.. ట్రాలీ ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, పర్వతగిరి మండలం వడ్లకొండ వద్ద బైక్.. మట్టిదిబ్బను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



తల్లిని చూడడానికి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లిన బైక్..
● అక్కడికక్కడే అన్నాచెల్లెలు మృతి



లారీకింద ఇరుక్కుపోయిన సుజిత్‌రెడ్డి,పూజితారెడ్డి

హసన్‌పర్తి : రెండు రోజులు సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి స్వగ్రామానికి వస్తున్న అన్నా చెల్లెలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజాత– దేవేందర్‌రెడ్డి దంపతులకు కుమారుడు సుజిత్‌రెడ్డి (27), పూజితారెడ్డి(24) ఉన్నారు. పూజితారెడ్డి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుండగా, సుజిత్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శని, ఆదివారాల్లో సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి బైక్‌పై నాగారం వస్తున్నారు.ఈ క్రమంలో బైక్.. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. దీంతో వారు అక్కడిక్కడే ప్రాణాలు వదిలారు.

అనాథ అయిన తల్లి.

కాగా, కొడుకు, కూతురు మృతి చెందడం, అంతకుముందే భర్తను కోల్పోవడంతో ప్రస్తుతం ఆ తల్లి అనాథ అయింది. కష్టాలు తీరుతాయని సంతోష పడిన తల్లికి మరిన్ని కష్టాలు తోడయ్యాయి. కొడుకు, కూతురు మృతదేహాలపై ఆ తల్లి పడి ఏడుస్తుండగా, అక్కడ ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

మట్టిదిబ్బను ఢీకొని..



రాజు మృతదేహం

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్లకొండ, ఉప్పరపల్లి గ్రామాల మధ్యలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం వడ్లకొండకు చెందిన తాటికాయల రాజు కుటుంబ సభ్యులతో కలిసి అనంతారంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి పని నిమిత్తం వడ్లకొండకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అనంతరం రాజు ఎంతకూ ఇంటికి రాలేదు. దీంతో అతని తమ్ముడు నవీన్, కొడుకు రవితేజ.. రాజు ఆచూకీ కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వడ్లకొండ, ఉప్పరపల్లికి దారిలో రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బను గుద్దుకుని కిందపడి ఉన్నాడు. గమనించిన వారు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే రాజు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో, బైక్ ఢీ..

● ఇద్దరి మృత్యువాత



సమ్మక్క, అశోక్ మృతదేహాలు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కొర్లకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన చేరాల అశోక్ ద్విచక్ర వాహనంపై మహాముత్తారం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారులోని అలుగు వాగు సమీపంలో గోదావరిఖని నుంచి మంగపేటకు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో ట్రాలీ ఆటోలో ముందు భాగంలో కూర్చున్న చిల్ల సమ్మక్కతో పాటు అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాటారం సీఐ రంజిత్‌రావు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు చిల్ల పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లయిన మూడు నెలలకే కబళించిన మృత్యువు..

● బైక్, లారీ ఢీ
● దంపతులు మృతి



నారాయణ సింగ్,అంజలి మృతదేహాలు

మరిపెడ రూరల్ : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో నవ దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు. కాగా, పెళ్లయిన మూడు నెలలకే దంపతులను లారీ రూపంలో మృత్యువు కబళించింది. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మరిపెడ మండల కేంద్రం పూలబజార్‌కు చెందిన అంజలి (21)కి జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చెల్లగరిగెకు చెందిన తునగర్ నారాయణసింగ్ (23)కు గత మార్చి 9న వివాహం జరిగింది. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీకెండ్ కావడంతో దంపతులు బైక్‌పై అత్తగారింటికి వస్తుండగా మరిపెడ మండలం కోమటికుంటతండా సమీపంలో ఎదురుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు.

'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షల'పై ఎఫ్ఐఆర్

● మధ్యవర్తిత్వం చేసిన 12 మందిపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, వరంగల్: 'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షలు' శీర్షిన సాక్షి ప్రధాన సంచికలో ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా పరిగణించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పోక్సో కేసు నీరుగార్చేలా మధ్యవర్తిత్వం చేసిన 12 మంది పెద్దలపై 195 (ఏ) రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఓ బాలికను నర్సంపేటకు చెందిన యువకుడు ప్రేమపేరుతో మోసం చేయడంతో అతనిపై 2022 ఆగస్టు 14న నమోదైన పోక్సో కేసు కోర్టులో కొట్టుడుపోయే విధంగా సహకరించాలంటూ పెద్దలు ఒత్తిడి తీసుకురావడంతో ఇష్టం లేని బాధితురాలు సీపీ రంగనాథ్‌ను గత గురువారం మరోమారు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అప్పటికే సాక్షిలో వచ్చిన కథనంతో మధ్యవర్తుల వివరాలు సేకరించిన ప్రత్యేక ఎస్‌బీ బృందం సీపీ కార్యాలయానికి తీసుకొచ్చి మరీ విచారించారు. ఈశ్వర్ సింగ్, అనిల్, మందకుమార్, జైపాల్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందన, నిరంజన్‌రెడ్డి, సూరయ్య, చల్లామల్లారెడ్డి, శారద, కొమ్మాలు, లక్‌పతిలపై నర్సంపేట టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఉందా, ఉంటే ఎవరూ ఉన్నారనే దిశగానూ ఎస్బీ బృందాలు ఇప్పటికే విచారణ ముమ్మరం చేసినట్టు తెలిసింది.

నర్సంపేట ఏసీపీ ఆఫీసు ఎదురుగానే పంచాయితీ



నర్సంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు.. ఓ తండాకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఆ తర్వాత మొహం చాటేయడంతో మోసపోయానని తెలుసుకున్న సదరు బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ వివాదాన్ని పెద్దల ముందు తీసుకెళితే పరిహారం ఇవ్వాలని నర్సంపేట ఏసీపీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఎంపీడీఓ ఆఫీసులో జరిగిన పంచాయితీలో నిర్ణయించి రూ.13లక్షలకు తీర్మానం చేశారు. రూ.ఐదు లక్షలు తల్లి శారదకు ఇచ్చి అదే నగదును నర్సంపేటలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌లో చందన, మల్లారెడ్డి పేర్ల మీద ఉన్న జాయింట్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిర్యాదురాలు డబ్బు తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడంతో కోర్టు ద్వారా తనకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

తెలంగాణ అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం..



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం క్రాస్‌లోని వీఆర్‌గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ప్రతీ ఇంట్లో సంక్షేమం.. ప్రతీ ముఖంలో సంతోషం' అనే కోణంలో సీఎం కేసీఆర్ పని చేస్తున్నట్లు చెప్పారు. రూ. 60వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ చెక్కులు, బీసీ కులాలకు రూ.లక్ష చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్స కోట, డీఆర్‌డీఓ పీడీ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అని మిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, బిల్లా సుధీర్‌రెడ్డి, నర్సింహానాయక్, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

● రవాణా శాఖ ఉప కమిషనర్ పురుషోత్తం



విలేజీ బస్ ఆఫీసర్స్ మార్గదర్శకాల బుక్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ, ఏసీపీ, ఆర్ఎం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం హనుమకొండ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేజీ బస్ ఆఫీసర్స్ విధులను ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం జె.శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలేజీ బస్ ఆఫీసర్స్ నియామకంతో సంస్థకు మేలు చేకూరుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, డీఎంలు జి.సురేశ్, బాబు నాయక్ పాల్గొన్నారు.

ఒక ప్రశ్నపత్రానికి బదులు మరో ప్రశ్నపత్రం

● ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్‌లో గందరగోళం
● ఆన్‌లైన్‌లో పంపగా డౌన్‌లోడ్ కాగానే గుర్తించిన ప్రిన్సిపాల్
● మళ్లీ అసలు ప్రశ్నపత్రంతో గంట ఆలస్యంగా పరీక్ష



కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలో శుక్రవారం ప్రారంభమైన ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో గందరగోళం నెలకొంది. అడ్వాన్స్‌డ్ ఫార్మకాలజీ–1 ప్రశ్నపత్రానికి బదులు ఫార్మకాలజీ–2 పేపర్‌ను పరీక్షల విభాగం (కాన్ఫిడెన్షియల్) అధికారులు ఆన్‌లైన్‌లో పంపారు. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల కేంద్రంలో ఉదయం 10 గంటలకు పరీక్ష జరగాల్సి ఉండగా కొద్ది సమయం ముందు ప్రశ్నపత్రాన్ని ప్రిన్సిపాల్ డౌన్‌లోడ్ చేశారు. అయితే, అడ్వాన్స్‌డ్ ఫార్మకాలజీ–1కు బదులు ఫార్మకాలజీ–2 ప్రశ్నపత్రం వచ్చిందని గుర్తించారు. హాజరైన 20 మంది విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనే ఉండాలని సూచించారు. వెంటనే సమాచారాన్ని పరీక్షల విభాగం అధికారులకు ప్రిన్సిపాల్ ప్రసాద్ చేరవేశారు. దీంతో అప్రమత్తమైన పరీక్షల విభాగం అధికారులు మళ్లీ అడ్వాన్స్‌డ్ ఫార్మకాలజీ–1 ప్రశ్నపత్రాన్ని పరీక్ష కేంద్రాలకు ఆన్‌లైన్‌లో పంపేసరికే గంట సమయం గడిచిపోయింది. ఉదయం 10 గంటలకు జరగాల్సిన పరీక్షను 11 గంటల 10 నిమిషాలకు ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటల 10 నిమిషాల వరకు నిర్వహించారు. దీంతో విద్యార్థులు గంటపాటు ఇబ్బందులు పడ్డారు. ఎంత సమయం కోల్పోయారో అంత సమయం ఇచ్చి పరీక్ష నిర్వహించామని పరీక్షల నియంత్రణాధికారి పి మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. కాగా, మిగిలిన సబ్జెక్టుల స్పెషలైజేషన్ విద్యార్థులకు మాత్రం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యథావిధిగా పరీక్షలు నిర్వహించారు. కాన్ఫిడెన్షియల్ విభాగం నుంచి టైంటేబుల్ ప్రకారం ప్రశ్నపత్రాలను పంపాల్సి ఉంటుంది. లోపం ఎక్కడ జరిగింది, ఎవరి తప్పిదమో అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. చర్యలు ఎవరిపైన తీసుకుంటారో చర్చనీయాంశమైంది.

రివర్స్ వస్తూ బావిలో పడిన ట్రాక్టర్..

● డ్రైవర్ దుర్మరణం
● లింగాపురం అలుముకున్న విషాదఛాయలు



కీమ (ఫైల్)

చెన్నారావుపేట: ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న క్రమంలో బావిలో పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లింగాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాపురం శివారు మేఘ్యా తండాకు చెందిన అజ్మీరా కీమ (45) అదే తండాకు చెందిన అజ్మీరా శ్రీను ట్రాక్టర్‌ను తీసుకుని బానోత్ రవి అనే కౌలు రైతుకు చెందిన చెలక దున్నడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. చెలక దున్నుతున్న క్రమంలో రివర్స్ తీస్తూ వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పడ్డాడు. దీంతో కీమ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై తోట మహేందర్ ఘటనా స్థలికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు.అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఆత్మకూరు : వడదెబ్బతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోపిరెడ్డి లక్ష్మీనారాయణ (65)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న సొప్ప శుభ్రం చేస్తుండగా వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురై ఒకసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొత్తదుబ్బతండాలో ..



హేమ్లా(ఫైల్)

డోర్నకల్: వడదెబ్బతో మండలంలోని కొత్తదుబ్బతండాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. తండాకు చెందిన ధారావత్ హేమ్లా(83) శుక్రవారం మున్నేరువాగు వద్దకు మేకలను మేతకు తీసుకెళ్లాడు. మండుతున్న ఎండకు అస్వస్థతకు గురై వాగు సమీపంలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేరుకు కౌలు.. చేసేది నకిలీ విత్తన దందా..



● పల్నాడు టు కామారెడ్డిగూడెం..
● నకిలీ విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు
● పోలీసులకు అప్పగింత



కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు

దేవరుప్పుల: వ్యవసాయ భూముల కౌలు పేరిట వలస వచ్చిన ఆంధ్రాకు చెందిన రైతులు ఇక్కడి రైతులను నమ్మబలుకుతున్నారు. అనంతరం నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డిగూడెంలో వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుకు చెందిన చందుపాటు రామారావు మండలంలోని కామారెడ్డిగూడెంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో ఇక్కడి రైతులతో సన్నిహిత్యం పెంచుకొని పలు పేరుమోసిన కంపెనీల నుంచి ప్యాకింగ్ అయ్యే వచ్చే విత్తనాలు ఇవేనని నమ్మబలికి దేవరుప్పుల, కామారెడ్డిగూడెంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆంధ్రాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తిలో తీసిన విత్తనాలను శుద్ధి చేసి ఇక్కడ రంగులద్ది కిలో రూ. వేయి చొప్పున విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వ్యవసాయ అధికారులు కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలతో ఉన్న చందుపాటి రామరావుతోపాటు స్థానికుడు మరాటి యాదిగిరిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ పరశురామ్‌నాయక్, ఇన్‌చార్జి ఏఓ రాజు, ఏఇఓ సాగర్, హెచ్‌సీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి

● ముల్కనూర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి
● వరంగల్ ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు ప్రారంభం

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ములుకనూరు సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అసోచం ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగనున్న టీఎస్ అగ్రిటెక్ రైతు సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అసోచం అడిషనల్ డైరెక్టర్ దినేశ్ అధ్యక్షత వహించగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం కోసం రైతులు మారుతున్న కాలానికనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. వరంగల్ ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు.అలాగే, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉండాలన్నారు. మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దని సూచించారు. కోరమండల్ జీపీ సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త బలరాం, జేడీఏ ఉషాదయాల్, డీఏవో రవీందర్ పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న మైనర్‌తోపాటు ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. వారినుంచి రూ.2.75 లక్షల విలువగల మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాల్‌నగర్ చెందిన బాలుడితోపాటు విసునూటి రవీందర్ అలియాస్ బబ్లూ, అలుగు నరసింహారావులు జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నారు. బాలుడు గతంలో పద్మాక్షి దేవాలయంలో హుండీ పగులగొట్టి డబ్బుల చోరీకి పాల్పడ్డాడు.. నిందితులు హనుమకొండ, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీచేశారు. గత నెల 20న ములుగు జిల్లా , గోవిందరావుపేట మండలం మచ్చాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డుపక్కన పడేసిన బైక్‌ను అపహరించారు. వీరిని శుక్రవారం హంటర్‌రోడ్డులోని రాజ్ హోటల్ పరిసరాలలో అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.